సాక్షి
అనకాపల్లి
గురువారం ၊ 29 ၊ ఫిబ్రవరి ၊ 2024



రత్నంపేటలో సెర్చ్ ఆపరేషన్
రోలుగుంట మండలం రత్నంపేటను పోలీసులు చుట్టుముట్టారు. సెర్చ్ ఆపరేషన్ చేసి పలు నేరాలపై కేసులు పెట్టారు.
8లో



విమ్స్‌లో క్యాన్సర్ వైద్యం
ఆరిలోవ: విమ్స్‌లో అంకాలజీ నిపుణులు అందుబాటులో ఉన్నారని డైరెక్టర్ కె.రాంబాబు తెలిపారు.



ఎరుకుమాంబకు జలాభిషేకం
విశాఖ: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు జలాభిషేకం చేశారు.

న్యూస్‌రీల్

రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై నేటి నుంచి రాకపోకలు



రాకపోకలకు సిద్ధమైన ఫ్లై ఓవర్ వంతెన

యలమంచిలి రూరల్: ఎన్నాళ్ల నుంచో ఎదురు చూస్తున్న రైల్వే ఫ్లై ఓవర్ వంతెన అందుబాటులోకి రానుంది. గురువారం నుంచి బ్రిడ్జిపై రాకపోకలను అనుమతించనున్నారు. 2009లో ప్రారంభమైన నిర్మాణాన్ని గత టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే పట్టుదలగా పూర్తి చేయించి, ఎమ్మెల్యే కన్నబాబురాజు ఇటీవల ప్రారంభింపజేశారు. తుది పనులు పూర్తి కావల్సివుండడంతో వారం రోజుల పాటు ఫ్లై ఓవర్‌పై వాహనాలను అనుమతించలేదు. ముగింపు పనులన్నీ పూర్తి కావడంతో గురువారం ఉదయం నుంచి వంతెన తెరచి ఉంచుతారు. ముందుగా ఎమ్మెల్యే నేతృత్వంలో పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఫ్లై ఓవర్ వంతెనపై బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు.

యువతిని రక్షించిన పోలీసులు

అల్లిపురం: ఆత్మహత్య చేసుకునేందుకు ఆర్.కె.బీచ్‌కు వచ్చిన యువతిని నగర పోలీసులు రక్షించారు. మంగళవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. నగర పోలీస్ కమిషనర్ కార్యాలయం తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా రైల్వేస్టేషన్ ప్రాంతానికి చెందిన సరిపల్లి రమ్య ఇంట్లో గొడవపడి చనిపోదామని నేరుగా ఆర్.కె.బీచ్‌కు వచ్చింది. ఆమె కదలికలపై అనుమానం రావడంతో అబిష్ అనే వ్యక్తి రాత్రి 10.35 సమయంలో డయల్ 112కు ఫోన్ చేసి.. ఓ అమ్మాయి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నిస్తోందని సమాచారం అందించాడు. కంట్రోల్ రూం నుంచి 3వ పట్టణ పోలీస్ స్టేషన్‌కు సమాచారం రావడంతో... దిశా మొబైల్, ఆర్.కె.బీచ్ టూరిస్టు పోలీస్ స్టేషన్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. టూరిస్ట్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ కేబీవీ కిశోర్, దిశ మొబైల్ డ్రైవర్ నారాయణరావు బీచ్‌లో గాలించారు. వారికి అమ్మాయి కనిపించడంతో ప్రశ్నించి.. మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కౌన్సెలింగ్ ఇచ్చి.. ఆమె అన్నయ్య భానుప్రసాద్‌ను పిలిపించి అప్పగించారు. సమాచారం ఇచ్చిన యువకుడిని, సకాలంలో బాధితురాలిని గుర్తించి, ఆత్మహత్యకు పాల్పడకుండా కాపాడిన పోలీస్ సిబ్బందిని సీపీ రవిశంకర్ అభినందించారు.

టెట్‌కు 90.69 శాతం హాజరు

విశాఖ విద్య: టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్-2024) రెండో రోజు బుధవారం ప్రశాంతంగా జరిగింది. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని ఏడు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. 4,333 మంది విద్యార్థులు పరీక్షకు నమోదు చేసుకోగా వీరిలో 3,930 మంది హాజరైనట్లు డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. రాష్ట్ర పరిశీలకులు నాలుగు కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ ఒక చోట, డీఈవో ఒక కేంద్రాన్ని పరిశీలించారు.

బినామీ సొమ్ము బాబు పాలు!

- జనసేనలో చక్రం తిప్పుతున్న ఇద్దరు నేతలు
- ఎంపీగా పోటీ చేస్తే ఎన్నికల ఖర్చంతా భరిస్తామని ఓ 'బాబు'కు హామీ
- రూ. 50 కోట్ల మేర భరించేందుకు సిద్ధమని వెల్లడి
- ఇదంతా ఓ కార్పొరేట్ కంపెనీ డైరెక్టర్ బినామీ సొమ్మని ప్రచారం



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

జనసేనకు చెందిన 'బాబు'ను ఎంపీగా బరిలో దింపేందుకు ఆ పార్టీలోని ఇద్దరు నేతలు చేస్తున్న హడావుడి వెనుక ఓ కార్పొరేట్ కంపెనీ డైరెక్టర్ బినామీ డబ్బుల గలగలలు ఉన్నాయనే చర్చ జరుగుతోంది. ఎంపీగా బరిలో నిలిస్తే అయ్యే మొత్తం ఖర్చును తామే భరిస్తామంటూ ఇద్దరు నేతలు సదరు బాబు ముందు ప్రతిపాదించారు. ఇందుకు అనుగుణంగా ఆ నేత కూడా ఎంపీగా బరిలో నిలిచేందుకు నియోజకవర్గంలో హడావుడి చేస్తున్నారు. ఎన్నికల ఖర్చు రూ.50 కోట్ల వరకు తాము భరిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిసింది. ఇందుకు ప్రతిఫలంగా తమకు రెండు సీట్లు కావాలంటూ ప్రతిపాదించారు. ఇందుకు ఆ నేత కూడా ప్రాథమికంగా అంగీకరించినట్టు తెలిసింది. జనసేన అధినేతకు చెప్పి రెండు సీట్లు ఇప్పించే పూచీ నాదీ అని ఆ 'బాబు' కూడా హామీ ఇచ్చారని ఈ ఇద్దరూ నేతలు ప్రచారం చేసుకుంటున్నారు. పోర్టులో ఎగుమతి దిగుమతి వ్యాపారం చేసే వారికి తోడు తాజాగా పార్టీలో చేరిన మరో నేత కూడా జతకట్టారు. వీరంతా కలిసి సదరు బాబును ముగ్గులోకి దించి ముచ్చటగా తమ పని కానించుకుంటున్నట్టు ఆ పార్టీలో చర్చ జరుగుతోంది.

బినామీగా ఉంటూ బిల్డప్!

వాస్తవానికి పెద్దగా ఆర్థికంగా బలంగా లేని సదరు నేతలు పార్టీలో ముఖ్యుల వద్ద చేస్తున్న హడావుడి చూసి పార్టీలోని ఇతర నేతలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఓ కార్పొరేట్ కంపెనీలో డైరెక్టర్‌గా ఉన్న వ్యక్తికి వీరిలో ఒకరు బినామీగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అంతేకాకుండా పోర్టులో కాంట్రాక్టు పనిచేసే సదరు వ్యక్తితో కలిసి ఆ కంపెనీ డైరెక్టర్ వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగానే ఆయన ఈ నేత వద్ద భారీ మొత్తం బినామీగా ఉంచినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ మొత్తాన్ని చూపించే ఇప్పుడు ఎన్నికల వ్యయాన్ని భరించేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెబుతున్నారని పార్టీలోని సీనియర్ నేతలు పేర్కొంటున్నారు. తాము ఫలానా కంపెనీకి బొగ్గును దిగుమతి చేశామని, రూ.100 కోట్ల బిల్లుల కోసం వెళుతున్నామంటూ 'బాబు' వద్ద హడావుడి చేసి బుట్టలో వేసుకున్నారని పార్టీలోని సీనియర్ నేతలు చెవులు కొరుక్కుంటున్నారు. అంతేకాకుండా కొద్దిరోజుల క్రితం 'బాబు' ఇంట్లో జరిగిన పెళ్లికి కూడా రూ. 2 కోట్ల మేర నగదును ఇవ్వడంతో పాటు.. ఆ పెళ్లికి కార్పొరేట్ కంపెనీ డైరెక్టర్‌ను కూడా తమతో తీసుకెళ్లారని సమాచారం. వీరి బుట్టలో పడిన ఆ 'బాబు' రోజువారీ కార్యక్రమాలన్నీ వారు చెప్పినట్టే ఉంటున్నాయని సీనియర్లు వాపోతున్నారు. మరోవైపు పార్టీలో ప్రజల్లో బలం ఉన్న నేతలను కాదని... పైరవీకార్లకు ప్రాధాన్యత పెరుగుతోందని సీనియర్లు వాపోతున్నారు. పార్టీలో సీట్ల అమ్మకాలు జరిగిపోతున్నాయని జనసైనికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోర్టు వ్యాపారంలో ఉన్న మరో ఇద్దరు నేతలు కాస్తా... ఈ బినామీల వ్యవహారాన్ని ఆ కార్పొరేట్ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నట్టు చెబుతున్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

సాక్షి, అనకాపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే నెల 7న అనకాపల్లి రానున్న నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఏర్పాట్లు పరిశీలించారు. బుధవారం ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ కె.వి.మురళీకృష్ణ పిసినికాడ గ్రామాన్ని సందర్శించి బహిరంగ సభ ఏర్పాట్ల గురించి చర్చించారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో హెలిప్యాడ్‌కు స్థల పరిశీలన చేశారు. ముఖ్యమంత్రి 7న వైఎస్సార్ చేయూత చివరి విడత నిధులు విడుదల చేయనున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన వారిలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మలసాల భరత్‌కుమార్, ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, అధికారులు పాల్గొన్నారు.

నాడు-నేడు.. బడి ఎంత బాగుందో చూడు



వేంపాడు హైస్కూల్‌ను సందర్శించిన డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

నక్కపల్లి: ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి అభివృద్ధి చేసిన ఘనత వైఎస్ జగన్ ప్రభుత్వానికే దక్కుతుందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. బుధవారం వేంపాడులో ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ఆయన గ్రామంలో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో జరిగిన నాడు నేడు పనులను పరిశీలించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఎన్ని కోట్లయినా కేటాయించేందుకు జగనన్న సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ముందుగా ప్రకటించిన విధంగా సంక్షేమ క్యాలెండర్‌ను అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అమ్మఒడి, విద్యాదీవెన, విద్యావసతి, రైతు భరోసా, చేయూత, ఆసరా, సున్నావడ్డీ, రైతు రుణమాఫీ, 30లక్షల ఇళ్ల పట్టాలు, గృహనిర్మాణం తదితర పథకాలకు ముందుగానే క్యాలెండర్‌ను రూపొందించి అమలు చేశారన్నారు. మేనిఫెస్టోను పార్టీ వెబ్‌సైట్ నుంచి తొలగించిన ఘనత చంద్రబాబునాయుడిదన్నారు. సంక్షేమ పథకాల వల్ల రాష్ట్రం మరో శ్రీలంకగా మారుతోందని విష ప్రచారం చేసిన చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్‌లు ఇప్పుడు సంక్షేమ మంత్రం పఠిస్తున్నారన్నారు. బీజేపి, జనసేనలతోనే కాదు, కాంగ్రెస్, వామపక్షాలతో కూడా పొత్తు పెట్టుకోగల అసమర్థుడు చంద్రబాబు అన్నారు.

సత్వరమే సమగ్ర సర్వే

- విసన్నపేటలో 400 ఎకరాలు ఎక్కువ ఉన్నట్టు చూపుతున్న రికార్డులు
- క్రయవిక్రయాల సమయంలో అమ్మకందారుని పేరు తొలగించక పోవడమే కారణం
- 10 మందితో సర్వే జరిపించాలని ఉన్నతాధికారుల కమిటీ ఆదేశం



విసన్నపేట వద్ద వివాదాస్పద భూములను పరిశీలిస్తున్న ఉన్నత స్థాయి అధికారుల కమిటీ సభ్యులు

కొంకోట: విసన్నపేట వద్ద వివాదాస్పద భూముల వ్యవహారంలో వాస్తవాలను వెలికితీయడానికి కలెక్టర్ నియమించిన ఉన్నతాధికారుల కమిటీ బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించింది. సర్వే నెంబర్ 195-2లో 609 ఎకరాల భూములు ఉండాల్సి ఉండగా, సుమారు వెయ్యి వరకు భూములున్నట్లు రికార్డులు చూపుతున్న దృష్ట్యా సత్వరమే సమగ్ర సర్వే జరిపించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.రమామణి ఆదేశించారు. భూముల కొనుగోలు, అమ్మకాల సమయంలో అమ్మకందారుని పేరు తొలగించకపోవడం వల్ల ఇటువంటి పరిస్థితి ఏర్పడి ఉంటుందన్నారు. దీని దృష్ట్యా వాస్తవాలను నిర్ధారించడానికి 10 మంది సర్వేయర్లతో భూముల సమగ్ర సర్వే జరిపించాలని అధికారులను ఆదేశించారు. కమిటీ విచారణ సందర్భంగా గుర్తించడానికి సర్వే నెంబర్ 195-2 లో ఉన్న యాజమాని, రైతులు తమ భూముల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు వారికి సమాచారం అందించాలన్నారు. జిల్లా రిజిస్ట్రార్ సిహెచ్.జానకీదేవి, నీటిపారుదల శాఖ ఎస్‌ఈ కె.స్వర్ణకుమార్, మైనింగ్ ఏడీ ఎ. సుబ్బారాయుడు, జిల్లా సర్వేయర్ ఎస్.గోపాలరాజు, కాలుష్య నియంత్రణ ఇంజనీర్ నాగిరెడ్డి, తహసీల్దార్ మధుసూదన, రెవెన్యూ సిబ్బంది పర్యటనలో పాల్గొన్నారు.

2,65,886 మంది రైతులకు భరోసా

- వారి బ్యాంకు ఖాతాల్లో రూ.53.32 కోట్లు జమ
- 36.643 మందికి రూ.6.90 కోట్ల సున్నావడ్డీ



రైతు భరోసా నమూనా చెక్కు అందిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, కరణం ధర్మశ్రీ, చిక్కాల రామారావు

తుమ్మపాల: అన్నదాతలకు పెట్టుబడి సాయంగా ప్రతి ఏటా అందిస్తున్న 'రైతు భరోసా' మరోసారి వారి తలుపు తట్టింది. తాడేపల్లిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా నిధులను బటన్ నొక్కి విడుదల చేశారు. ఆ కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్‌లో వీక్షించిన అనంతరం అనకాపల్లిలో అధికారులు, నాయకులు రైతులకు నమూనా చెక్కు అందించారు. జిల్లాలో 2,65,886 మంది రైతులకు రూ.53 కోట్ల 32 లక్షల ఐదో విడత వైఎస్సార్ రైతు భరోసా నగదు విడుదల చేస్తున్నట్టు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి చెప్పారు. 36,643 మంది రైతులకు రూ.6 కోట్ల 90 లక్షల 36 వేల వైఎస్సార్ సున్నా వడ్డీ జమ చేసినట్లు తెలిపారు. ఆయనతోపాటు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, జిల్లా వ్యవసాయ అభివృద్ధి సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు నమూనా చెక్కును రైతులకు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మూడేళ్లగా జిల్లాలో 2,65,886 మంది రైతులకు రైతు భరోసాగా రూ.1,625 కోట్ల 68 లక్షల 60 వేలు నేరుగా బ్యాంకు ఖాతాలకు జమ చేశామన్నారు. ఏడాదికి రూ.13,500 ల చొప్పున రైతు భరోసా, పీఎం కిసాన్‌తో కలిపి ఇస్తున్నామన్నారు. అదేవిధంగా మహిళా రైతులు, ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనారిటీ రైతులకు ఇచ్చే రూ.13,500లు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ రైతు పక్షపాత ప్రభుత్వంగా జగనన్న సర్కారు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుకు ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యవసాయాధికారి మోహనరావు, సర్పంచ్, ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.

విజయీభవ

- రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిఘా
- కేంద్రాల వద్ద 144 సెక్షన్
- జెరాక్స్ సెంటర్ల మూసివేత
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ





యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జవాబు పత్రాలను సిద్ధం చేస్తున్న సిబ్బంది, (ఇన్‌సెట్) పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు



యలమంచిలి రూరల్: విద్యార్థి దశలో కీలకమైన ఇంటర్మీడియట్ వార్షిక పబ్లిక్ పరీక్షలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. వచ్చే నెల 20వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే పరీక్షల నిర్వహణకు జిల్లాలో 38 కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో పట్టణ ప్రాంతాల్లో 9, గ్రామీణ ప్రాంతాల్లో 29 కేంద్రాలున్నాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 28,621 మంది హాజరు కానున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా కేంద్రాల్లో ఫర్నిచర్, తాగునీరు, ఫ్యాన్లు, వైద్యసేవలు అందుబాటులో ఉంచినట్టు అధికారులు తెలిపారు. గదుల్లో వెలుతురు, గాలి వచ్చేలా అవసరమైన ఏర్పాట్లు చేశారు. పరీక్ష సమయంలో కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. మాస్‌కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా కేంద్రాలకు సమీపంలో ఉన్న జెరాక్సు సెంటర్లను మూసివేసేలా ఆదేశాలిచ్చారు. పరీక్ష కేంద్రాలకు అరగంట ముందుగానే చేరుకోవాలని సూచించారు. నిమిషం ఆలస్యమైనా లోనికి అనుమతించబోమని స్పష్టం చేశారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఏ పరీక్ష కేంద్రంలో కూడా నేలబారు పరీక్షలకు వీలు లేకుండా పూర్తి స్థాయిలో ఫర్నిచర్ ఉండేలా పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. పరీక్ష జరుగుతున్న సమయంలో ఆ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.

పర్యవేక్షణ

జిల్లా వ్యాప్తంగా పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేందుకు 2 ఫ్లయింగ్ స్క్వాడ్, 2 సిటింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు ప్రతిరోజూ జిల్లాలోని పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తాయి. విద్యార్థుల వద్ద చిట్టీలు లభిస్తే మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదు చేస్తారు. ప్రతి పరీక్ష కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంటల్ అధికారిని చొప్పున మొత్తం 38 మంది నియమించారు చీఫ్ సూపరింటెండెంట్లు, 41 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించారు. 540మందికి పైగా ఇన్విజిలేటర్లను నియమించారు. వీరితోపాటు ఆరుగురు కస్టోడియన్లు 15 స్టోరేజి పాయింట్లలో (సమీపంలో పోలీస్ స్టేషన్లలో) భద్రపరిచిన ప్రశ్నపత్రాలను కేంద్రాలకు సక్రమంగా చేరేలా ఏర్పాటు చేశారు. ప్రతిరోజు నిర్ణీత సమయానికి ప్రశ్నపత్రాలను పోలీసు బందోబస్తు నడుమ కేంద్రాలకు తీసుకెళ్లేలా కేంద్రాల పర్యవేక్షకులకు ఆదేశాలు జారీ చేశారు. మొత్తం 570 సీసీ కెమెరాల ద్వారా కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్న తీరును అధికారులు క్షుణ్ణంగా పర్యవేక్షించనున్నారు. జిల్లా స్థాయిలో డీఐఈవో కన్వీనర్‌గా ఐదుగురు సభ్యుల కమిటీ పరీక్షలు సజావుగా జరిగేలా చూస్తుంది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా పూర్తి స్థాయిలో వసతులు కల్పించారు. పరీక్ష కేంద్రాల బాధ్యతలు చూసే అధికారులకు పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేలా ప్రత్యేక సమావేశాలు నిర్వహించి సూచనలిచ్చారు.

పరీక్ష కేంద్రాలు : 38	
పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు	
మొదటి సంవత్సరం	
జనరల్	వొకేషనల్
10,704	2,619
రెండవ సంవత్సరం	
జనరల్	వొకేషనల్
12,708	2,590
మొత్తం : 28,621	

అన్ని ఏర్పాట్లు పూర్తి



ఇంటర్ పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశాం. నిమిషం ఆలస్యమైనా కేంద్రాల్లోకి అనుమతి ఉండదు. 600 మంది కంటే ఎక్కువ విద్యార్థులు పరీక్ష రాస్తున్న కేంద్రాల్లో అదనంగా మరొక డిపార్ట్‌మెంటల్ అధికారిని నియమించాం. పరీక్ష హాల్లో తాగునీరు, ప్రథమ చికిత్స, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నాం. పరీక్ష కేంద్రాలను నో సెల్‌ఫోన్ జోన్‌గా ప్రకటించాం. డీవో, ఇన్విజిలేటర్లు సహా ఏ ఒక్కరూ సెల్‌ఫోన్ వినియోగించడానికి వీల్లేదు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించడానికి పోలీసు, రెవెన్యూ శాఖల సహకారం తీసుకుంటున్నాం.

–బి.సుజాత, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి

హాల్ టికెట్లు నిరాకరిస్తే కఠిన చర్యలు

తుమ్మపాల: ఫీజు బకాయిలు, హాజరు సరిపడలేదన్న సాకుతో ఇంటర్ విద్యార్థులకు హాల్‌టికెట్ నిరాకరించినట్లు ఫిర్యాదులు వస్తే కార్పొరేట్, ప్రైవేటు కళాశాల గుర్తింపు రద్దుతో పాటు ఆయా యాజమాన్యాలపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎస్సీపీసీఆర్) సభ్యులు గొండు సీతారాం ఒక ప్రకటనలో తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా ఈ ఏడాది ఇంటర్మీడియట్ బోర్డ్ ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా నేరుగా హాల్‌టికెట్లు జారీ ప్రక్రియ ప్రారంభించిందన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ వెబ్‌సైట్ ద్వారా హాల్ టికెట్లను పొందే వెసులుబాటు ఉందన్నారు. కళాశాలల యాజమాన్యాలు వేధింపులకు గురి చేస్తున్నట్టు ఫిర్యాదుల prcpcr2018@gmail.com మెయిల్‌కు పంపిస్తే చర్యలకు ఉపక్రమిస్తామని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల చుట్టూ పటిష్ట నిఘా

- సమీప ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు
- స్ట్రాంగ్ రూంలు పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



మాడుగుల ఆర్‌సీఎం బాలికోన్నత పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ

సాక్షి, అనకాపల్లి: రానున్న ఎన్నికల్లో పోలింగ్ బూత్ సమీప పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాల నిఘా పెంచుతున్నట్లు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బుధవారం స్ట్రాంగ్ రూములను ఎస్పీ కె.వి.మురళీకృష్ణతో కలిసి ఆయన పరిశీలించారు. చోడవరం డిగ్రీ కాలేజి, వి.మాడుగుల ఆర్.సి.ఎం. స్కూల్ వద్ద స్ట్రాంగ్ రూములను, అనకాపల్లి జీవీఎంసీ మెయిన్ స్కూల్‌లో సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ ఉండేందుకు వసతి ఏర్పాట్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరిసర ప్రాంతాల్లో నిరంతర సీసీ కెమెరాల నిఘా, ప్రత్యేక సాయుధ బలగాల పహారా ఏర్పాట్లు చేయడం, పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం కట్టుదిట్టమైన భద్రతతో ఈవీఎంలను స్ట్రాంగ్‌రూంలకు చేర్చి భద్రపరచడం మొదలైన అంశాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, విమర్శలకు తావులేకుండా అన్ని శాఖల సమన్వయంతో సమర్థవంతంగా, పకడ్బందీగా పటిష్ట ప్రణాళికతో బందోబస్తు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. పర్యటనలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఆర్డీవో చిన్నికృష్ణ, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ వి.సుబ్బరాజు, ఎస్బీ డీఎస్పీ బి.అప్పారావు, మాడుగుల ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.వి.సత్యవాణి పాల్గొన్నారు.

ఓట్ యాప్‌తో ఉపయోగాలెన్నో..



వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన డీఆర్వో దయానిధి

తుమ్మపాల: జిల్లాలో ఓటర్లందరూ ఓట్ యాప్‌ను తమ మొబైల్ ఫోన్, కంప్యూటర్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి పిలుపునిచ్చారు. బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటు నమోదు చేసుకోవడం, యాప్ ద్వారా తమ ఓటును పరిశీలించడం, ఓటరు సంఖ్యను తెలుసుకోవడంపై అవగాహన కలిగించుకోవాలన్నారు. ఎపిక్ కార్డును కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు.

ఈ విషయంలో రాజకీయ పార్టీలు కూడా తమవంతు సహకారం అందించాలన్నారు. ఎన్నికల నామినేషన్ దాఖలు చివరిరోజుకు 10 రోజుల ముందు వరకు ఓటు నమోదు చేసుకోవచ్చన్నారు. ఓటర్ల నమోదు విషయమై వివిధ వార్తా పత్రికలలో వచ్చిన 26 ప్రతికూల వార్తలను పరిశీలించి పరిష్కరించామన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు డి.రామ్మూర్తి, డీటీ కె.రవికుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు కొల్లి రావు, పి.నాగేశ్వరరావు, ఆర్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డీఎస్పీగా మోహన్ బాధ్యతల స్వీకరణ



నర్సీపట్నం: నర్సీపట్నం డీఎస్పీగా జి.ఆర్.ఆర్.మోహన్ బుధవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన వెంకటరామయ్యకు కొద్ది రోజుల్లోనే బదిలీ అయింది. ఏలూరు ఏసీబీ డీఎస్పీగా పని చేస్తున్న మోహన్‌ను నర్సీపట్నానికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. టౌన్, రూరల్ సీఐలు కాంతికుమార్, హరి, ఎస్‌ఐలు దివాకర్, భీమరాజు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

'టీడీపీ కోవర్టులను సస్పెండ్ చేయాలి'



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బుచ్చెయ్యపేట: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన ఆర్నెళ్ల తరువాత వైఎస్సార్‌సీపీలో చేరిన ఆ ముగ్గురు తెలుగుదేశం కోవర్టులను సస్పెండ్ చేయాలని బుచ్చెయ్యపేట మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ శ్రేణులు కోరారు. భూదందాలను చేద్దామని ఆ ముగ్గురు అధికార పార్టీలోకి వచ్చారని కానీ, వారి ఆటలను ఎమ్మెల్యే ధర్మశ్రీ సాగనీయక పోవడంతో ఇప్పుడు తాజాగా లేనిపోని విమర్శలు చేస్తూ పార్టీ ప్రతిష్టను దిగజారుస్తున్నారని బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మండిపడ్డారు. పార్టీలో ఏమైనా సమస్యలు ఉంటే అంతర్గతంగా చర్చించుకోవాలి తప్ప, పార్టీ ప్రతిష్టను తగ్గించే విధంగా ప్రవర్తించడం పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించడమేనని అన్నారు. ఇక్కడ వారి ఆటలు సాగకపోవడంతో తిరిగి టీడీపీలోకి వెళ్లే ఉద్దేశంతోనే వారు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని తెలిపారు. అందువల్ల వారిపై పార్టీ అధిష్టానం కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. ఎమ్మెల్యే ధర్మశ్రీ దృష్టికి, జిల్లా నాయకుల దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకువెళ్లినట్టు వారు తెలిపారు.

రత్నంపేటలో సెర్చ్ ఆపరేషన్



సీజ్ చేసిన ద్విచక్రవాహనాలతో డీఎస్పీ సుబ్బరాజు, కొత్తకోట సీఐ అప్పలనాయుడు



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

- అనకాపల్లి డీఎస్పీ సుబ్బరాజు ఆధ్వర్యంలో జల్లెడ పట్టిన పోలీసులు
- పాల్గొన్న నలుగురు సీఐలు, 16 మంది ఎస్‌ఐలు, 120 మంది కానిస్టేబుళ్లు
- ధ్రువీకరణ పత్రాలు లేని మూడు ఆటోలు, కారు, 16 ద్విచక్రవాహనాల సీజ్
- 2,300 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం



సీజ్ చేసిన ఆటోలు, కారు

రోలుగుంట: మండలంలోని రత్నంపేటను పోలీసులు జల్లెడపట్టారు. వీధులు, పొలాలు, ఇళ్లలో విస్తృతంగా గాలించారు. ఈ గాలింపులో 120 మంది పోలీసులు, నలుగురు సీఐలు, 16 మంది ఎస్‌ఐలు పాల్గొన్నారు. ఒక్కసారిగా పెద్ద ఎత్తున పోలీసులు రావడంతో గ్రామస్తులు ఆందోళన చెందారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, సారా తదితర వాటిని నియంత్రించడంలో భాగంగా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఆదేశాలతో అనకాపల్లి డీఎస్పీ సుబ్బరాజు ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలో సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఏ విధమైన ధ్రువీకరణ పత్రాలు లేని మూడు ఆటోలు, ఒక కారు, 16 ద్విచక్రవాహనాలను సీజ్ చేసి రోలుగుంట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. గ్రామ పరిసరాల్లో సారా తయారీ కోసం నిల్వ ఉంచిన 2,300 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న డీఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నాయకులు నగదు, వస్త్రాలు, ఇతర సామగ్రిని పంపిణీ చేయకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఇందుకోసం గ్రామాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గంజాయి రవాణా నిరోధానికి చర్యలు చేపట్టినట్టు చెప్పారు. ఇందుకు ప్రజా ప్రతినిధులు, యువకులు సహకరించాలని ఆయన కోరారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి జాయింట్ సర్వే



గొడిచర్ల రైల్వేట్రాక్ వద్ద పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో, రైల్వే అధికారులు

నక్కపల్లి: మెరకగ్రామాల్లో విద్యుత్ సమస్యలపరిష్కారం కోసం రైల్వే, ట్రాన్స్‌కో అధికారులు బుధవారం జాయింట్ సర్వే నిర్వహించారు. మండలంలో డొంకాడ, జగన్నాథపురం, చీడిక, దోసాలపాడు, రేబాక, రమణయ్యపేట తదితర గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. విద్యుత్‌లైన్లు లేకపోవడం వల్ల నిరంతరం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. ఈ సమస్యను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు వీసం రామకృష్ణ, వీసం నానాజీ తదితరులు రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో సమస్య పరిష్కరించాలని ట్రాన్స్‌కో ఉన్నతాధికారులకు ఆదేశించారు. దీంతోవారు వచ్చి పరిశీలించారు. గొడిచర్ల సబ్‌స్టేషన్‌నుంచి విద్యుత్ సరఫరా చేసేందుకు రైల్వే ట్రాక్ అడ్డంగా ఉండడంతో అవసరమైన అండర్ గ్రౌండ్ కేబుళ్లు ఏర్పాటు చేయడం కోసం రైల్వే, ట్రాన్స్‌కో అధికారులు గొడిచర్ల రైల్వేట్రాక్ వద్ద పరిశీలించారు. కేబుళ్లు ఏర్పాటు చేయడం, అదనంగా లైన్లు వేయడం వంటి పనుల కోసం ప్రతిపాదనలు పంపించేందుకు జాయింట్ సర్వే చేస్తున్నట్టు రైల్వే, ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైసీఎంపీపీ వీసం నానాజీ, సర్పంచ్‌లు కొండలరావు, ఎంపీటీసీ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధత, సమన్వయంతో ఎన్నికల విధులు



శిక్షణలో మాట్లాడుతున్న జయంతి

తుమ్మపాల: నిబద్ధత,సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల శిక్షకులు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ పి.జయంతి తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలోని అధికారులకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆమె మాట్లాడారు. చిన్న పొరపాటుకు కూడా అవకాశమివ్వకుండా పూర్తి పారదర్శకతో పనిచేయాలన్నారు. కేటాయించిన విధులపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అసెంబ్లీ స్థాయి మానటరింగ్ టీమ్, వీడియో వీవింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్, ఎంసీసీ టీమ్స్, సెక్టార్ అధికారులు, రూట్ అధికారులు, పోలీసు అధికారులు తమకు అప్పగించిన విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలన్నారు.నిబంధనలను పూర్తిగాఆకళింపు చేసుకోవాలని తెలిపారు సందేహాలుంటే వెంటనే నివృత్తి చేసుకోవాలన్నారు.డీపీఆర్సీ జిల్లాకోఆర్డినేటర్ నాగలక్ష్మి ఎన్నికల విధులనిర్వహణ గురించి వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తిమృతి



మరణించిన సన్యాసిరావు(ఫైల్)

నక్కపల్లి: జాతీయరహదారిపై బుధవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. అనకాపల్లికి చెందిన సన్నిధి సన్యాసిరావు(32) వివాహానికి వెళ్లేందుకు బైక్‌పై కాకినాడ బయలుదేరాడు. గొడిచర్ల వద్ద బైక్ డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేశారు.

నాదెండ్ల పేరంటం!

- గూడెం సభకు పవన్ రమ్మన్నారు..
- జనసేన అసంతృప్తులకు ఫోన్లో పేరు పేరునా ఆహ్వానం
- అరకొర సీట్లపై అసహనంతో రగిలిపోతున్న శ్రేణులు
- ఉమ్మడి విశాఖ నుంచి అయిష్టంగానే వెళ్లిన కొందరు నేతలు



సాక్షి, విశాఖపట్నం: పొత్తులో భాగంగా తెలుగు దేశం పార్టీ తమకు అరకొర సీట్లు కేటాయించడంపై జనసేన శ్రేణులు రగిలిపోతున్నారు. తమ అధినేత పవన్ కల్యాణ్ తీరుపై వీరు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. పైగా ఎప్పట్నుంచో పార్టీ కోసం కష్టపడి పని చేస్తున్న వారిని కాదని నిన్నగాక మొన్న చేరిన వారికే ప్రాధాన్యతనిస్తుండడం కూడా వీరికి రుచించడం లేదు. ఉమ్మడి విశాఖ జిల్లాలో జనసేన సీట్లను ఆశించి వైఎస్సార్‌సీపీ నుంచి జంప్ చేసిన నేతలకు బొటాబొటి సీట్ల కేటాయింపు మింగుడు పడడం లేదు. దీంతో వారంతా నైరాశ్యంలో ఉన్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ, జనసేనలు సంయుక్తంగా పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో బుధవారం బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఇప్పటికే వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సిద్ధం' సభలకు లక్షల్లో జనం పోటెత్తుతున్నారు. దీంతో టీడీపీ–జనసేనల పార్టీలకు గూడెం సభ ఎంతో ప్రతిష్టాత్మకంగా మారింది. పొత్తులో సీట్ల కేటాయింపునకు ముందు వరకు జనసేన శ్రేణులు ఒకింత ఉత్సాహంగా ఉండేవారు.

క్యాడర్‌లో నిరాశా నిస్పృహ

రాష్ట్ర వ్యాప్తంగా జనసేనకు టీడీపీ కేవలం 24 స్థానాలే కేటాయించడం, ఇటీవలే పార్టీలో చేరిన మాజీ మంత్రి కొణతాల రామకృష్ణకు అనకాపల్లి సీటు ఖరారు చేయడం వంటి పరిణామాలతో ఉమ్మడి విశాఖ జిల్లాలో ఆశావహులతో పాటు క్యాడరు కూడా నిరాశా నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్నారు. మునుపటిలా కాకుండా పార్టీ కార్యాలయాలకు, కార్యకలాపాలకు వీరు దూరంగా ఉంటున్నారు. ఈ పరిస్థితిని గుర్తెరిగిన జనసేన ముఖ్యనేతలు గూడెం సభకు ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ఆశించినంతగా హాజరుకారన్న భావనకొచ్చారు.

పవన్ సార్ రమ్మన్నారు...

దీంతో పార్టీలో పవన్ తర్వాత స్థానంలో ఉన్న నాదెండ్ల మనోహర్‌ను రంగంలోకి దించారు. రెండ్రోజుల క్రితం నుంచి ఆయన ఇక్కడ కీలక నాయకులకు ఫోన్లు చేసి మరీ ఆహ్వానించారు. 'కల్యాణ్ సార్ మీకు ప్రత్యేకంగా చెప్పమన్నారు. మీతో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ క్యాడర్‌ను కూడా తాడేపల్లిగూడెం సభకు తప్పకుండా తీసుకురండి.. మీ అందరూ వస్తేనే సభ సక్సెస్ అవుతుంది.. పార్టీలో ఇబ్బందులు, సీట్ల కేటాయింపు వంటి సమస్యలన్నీ నెమ్మదిగా పరిష్కారమవుతాయి..' అంటూ ఫోన్‌లో సముదాయించారు. ఈ నేపథ్యంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బొలిశెట్టి సత్యనారాయణ (సత్య), టి.శివశంకర్, మాజీ ఎమ్మెల్యే, జనసేన జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్, పీఏసీ సభ్యుడు కోన తాతారావు వంటి కొంతమంది నేతలు తాడేపల్లిగూడెం సభకు అయిష్టంగానే పయనమయ్యారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుంచి కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకులు నామమాత్రంగానే వెళ్లారు. చాలా మంది నాయకులు ఏదో వంక పెట్టి వెళ్లకుండా ఇక్కడే ఉండిపోయారు.

ఎన్టీఆర్ వైద్యాలయాన్ని సందర్శించిన కాయకల్ప బృందం

- గతంలో రెండు సార్లు ఆస్పత్రికి అవార్డులు
- ఈసారీ వస్తుందని ఆశాభావం



ఆస్పత్రిలో పిల్లలవార్డును పరిశీలిస్తున్న కాయకల్ప బృందం సభ్యులు

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయాన్ని బుధవారం రాష్ట్ర కాయకల్ప వైద్యుల బృందం సందర్శించింది. వైద్యాలయంలో పారిశుధ్యం, ఆస్పత్రిలో వివిధ విభాగాల్లో రోగులకు అందుతున్న సేవలపై బృందం సభ్యులు శ్రీనివాస్‌వర్మ, రూపేష్‌పాల్ ఆరాతీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో మూడు రోజుల పాటు ఎన్టీఆర్ వైద్యాలయం, నర్సీపట్నం ఆస్పత్రి, నక్కపల్లి సీహెచ్‌సీ, కోటవురట్ల, మాడుగుల ఆస్పత్రులను పరిశీలించినట్టు చెప్పారు. వీటిపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ అధికారి మోతే మణికంఠ, ఆస్పత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ ఎం.కెజీయా, వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో రెండు సార్లు ఎన్టీఆర్ ఆస్పత్రికి కాయకల్ప అవార్డు లభించిందని, తెలిపారు. ఈ సారికూడా అవార్డు వస్తుందని ఆశిస్తున్నట్టు ఆయన చెప్పారు.

టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలోకి



పార్టీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులకు వైఎస్సార్‌సీపీ కండువా వేసి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

చోడవరం: ఎన్నికలు సమీపిస్తున్న వేళ వైఎస్సార్‌సీపీకి ప్రజల మద్దతు రోజురోజుకీ పెరుగుతోంది. టీడీపీ, జనసేన నుంచి వివిధ గ్రామాల్లో పలువురు గ్రామస్థాయి నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. తాజాగా బుచ్చెయ్యపేట మండలం మల్లాం గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు ముచ్చల దేముడు, బొట్ట చినతల్లితోపాటు 10 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేశారు. గ్రామ సర్పంచ్ గొలగాని శివ, గొలగాని లోవరాజు, అప్పారావు ఆధ్వర్యంలో వారంతా చోడవరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ కరణం ధర్మశ్రీ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో బుధవారం చేరారు. వారికి ధర్మశ్రీ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు ఎంతో సేవచేస్తూ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, ఆయన మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్న ఆశయంతోనే పార్టీలో చేరుతున్నామని దేముడు, చినతల్లి తెలిపారు. పార్టీలు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని ఎమ్మెల్యే ధర్మశ్రీ అన్నారు. కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం ఉంటుందని ఆయన తెలిపారు.

NARSIPATNAM MUNICIPALITY

TENDER NOTICE

NARSIPATNAM MUNICIPALITY INVITES FOLLOWING TENDERS ON 'e'-procurement Platform

Sl. No.	Grant Name and No of Works	Tender Calling	Total Value	Download Starting Date & Time	Download Ending Date & Time
1.	04 Works (SCSP)	Short Tender 1st Call	Rs.15.00 Lakhs	29-02-2024 by 11:00 AM	06-03-2024 by 03:30 PM
2.	01 Work (15th FC GRANT)	Short Tender 1st Call	Rs.5.00 Lakhs	29-02-2024 by 11:00 AM	06-03-2024 by 03:30 PM
3.	23 Works (15th FC GRANT)	4th & 5th Calls	Rs.85.98 Lakhs	29-02-2024 by 11:00 AM	06-03-2024 by 03:30 PM
4.	01 Work (General Fund)	5th Call	Rs.4.76 Lakhs	29-02-2024 by 11:00 AM	06-03-2024 by 03:30 PM

For details logon to www.apeprocurement.gov.in
Contact Ph. No. 9494189575, 9848925129.

Sd/- Commissioner,
Narsipatnam Municipality

గంజాయి కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలం

- ప్రభుత్వానికి రూ.7,42,300 ఆదాయం



డీసీ శ్రీరామచంద్రమూర్తి సమక్షంలో వాహనాలను వేలం వేస్తున్న ఎస్‌ఈబీ అధికారులు

నర్సీపట్నం: గంజాయి కేసుల్లో సీజ్ చేసిన 23 వాహనాలను నర్సీపట్నం ఎస్‌ఈబీ స్టేషన్‌లో బుధవారం వేలం వేశారు. ఈ వేలం ద్వారా ప్రభుత్వానికి రూ.7,42,300 ఆదాయం సమకూరింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌ఈడీ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ గంజాయి కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను వేలం వేయడం రాష్ట్రంలో ఇదే ప్రథమమని చెప్పారు.

ఇప్పటి వరకు గంజాయి కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేసిన దాఖలాలు లేవన్నారు. కోర్టు అనుమతి మేరకు డ్రగ్ డిస్పోజల్ కమిటీ సమక్షంలో వాహనాలను వేలం వేసినట్టు తెలిపారు. జోనల్ పరిధిలోని విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం ఎస్‌ఈబీ స్టేషన్‌ల్లో సీజ్ చేసిన గంజాయి వెహికల్స్ 900 ఉన్నాయని చెప్పారు. మొదటి విడతలో 40 వాహనాలను వేలం వేస్తున్నామని తెలిపారు. ఈ వేలంలో సీఐ కె.సునీల్‌కుమార్, బదిలీ అయిన సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DISTANCE EDUCATION

■ ఆంధ్రా యూనివర్సిటీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్: BA, B.Com, B.Sc., MA, M.Com., M.Sc., MBA & MCA అడ్మిషన్స్ జరుగుచున్నవి. ఫోన్: 73862 63237, 90590 86040 [V-2415]

Real Estate

LAND FOR SALE

■ AC 1.42 Cents of Land Bearing Sr. No.138/ 2 to 18 with 5000 Sq.Ft Shed Currents & Water, Surronded by Boundry wall at Kondarajupeta, Mopada Village, Denkada Mandal, Vizianagaram Dist. Ph : 77320 07771 [V- 3831]

Services

ASTROLOGY

■ శ్రీసాయి దుర్గ జ్యోతిష్యాలయం 8 సం॥లు స్థిరంగా ఉన్నారు. ప్రేమ, పెళ్ళి, వశీకరణ, అనారోగ్య, వ్యాపార, సంతానం మీ ఎటువంటి సమస్యలకైనా కొద్దిరోజుల్లో పరిష్కారం. SR మాల్ ప్రక్కన కొత్త గాజువాక. 7702201190. [W-1200988]

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

BUSINESS OFFER

■ ద్వారక ఎంటర్‌ప్రైజెస్: పేపర్‌ప్లేట్స్ & LED మిషన్స్ పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం. ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం ✆ 9310515624, 8800496710 [G-1438]

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 11574]

Wanted

■ మార్చి మొదటి వారంలో అమెరికా వెళుతున్న మాకు ఇంటి, వంట పనులు చేయుటకు ఆడమనిషి కావలెను. అమెరికా విజిటింగ్ వీసా కలిగిన వారు మాత్రమే సంప్రదించగలరు. ✆ 92904 15199 [B-790486]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 9059663584. [M-1233855]

■ Wanted Social Media Associate
Walk-in-Interview From 11 am to 5 pm MVS Silver Park, Sampath Vinayaka Temple Road, Vizag. Ph : 93915 66555 [V-17886]

■ Free Software Traning : B.Tech - Degree 21, 22, 23 Pass Outs, 4 Months Duration @ Dwarakanagar. Ph : 99633 66009, 95739 79344 [V-5494]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. ఫోన్: 9160900024 / 9640400073. [H-793697]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడి సూపర్‌వైజర్స్, నర్సులు, ఆయాలు, వాచ్‌మెన్‌లు, భార్యాభర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901. [HA-13601]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1167534]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి

అనకాపల్లి	: 9010546644
యలమంచిలి	: 9951602901
చోడవరం	: 9010210265
నర్సీపట్నం	: 9010234557
పాడేరు	: 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

ఆటో బోల్తా - డ్రైవర్‌కు గాయాలు




శారదానదిలో బోల్తాపడిన ఆటో

మునగపాక: మండలంలోని గణపర్తి శారదానది పరివాహక ప్రాంతంలో ఆటో బోల్తాపడిన సంఘటనలో ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.గణపర్తికి చెందిన ఆటో డ్రైవర్ రాపేటి రాము ఎప్పటిలాగానే శారదానది సమీపంలో రైతుల నుంచి సేకరించిన కూరగాయలతో బుధవారం తెల్లవారుజామున ఆటోలో బయలుదేరాడు. శారదానది గట్టుకు సమీపంలో ఉన్న పైప్‌ను గమనించకపోవడంతో ఆటో ఒక్కసారిగా శారదానదిలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న రాముకు గాయాలు కాగా, ఆటోలో ప్రయాణిస్తున్న కర్రి అప్పారావు నదిలోకి దూకి త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. పెద్ద ప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

రోడ్డుపై పడిన చెరకు లోడు

- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం



బీఎన్ రోడ్డుపై గజపతినగరం వద్ద గుట్టగా పడిన చెరకు లోడు



నిలిచిపోయిన వాహనాలు

చోడవరం: చెరకులోడు రోడ్డుపై పడడంతో చోడవరం–గోవాడ మధ్య ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. చోడవరం నుంచి గోవాడకు వస్తున్న లారీపై నుంచి గజపతినగరం సమీపంలో చెరకు లోడు జారి రోడ్డుపై అడ్డంగా పడింది. ఒకే సారి చెరకు కట్టలన్నీ లారీ పై నుంచి రోడ్డుపై పడడంతో వాహనచోదకులు భయాందోళనకు గురయ్యారు. సుమారు రెండు గంటలపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. అటు చోడవరం, ఇటు వెంకన్నపాలెం వరకూ ఇరుపక్కలా ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో వాహనచోదకులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వచ్చి రోడ్డుపై పడిన చెరకు లోడును పొక్లెయిన్‌తో పక్కకు తొలగించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఐపీఎల్ మ్యాచ్‌ల ఏర్పాట్ల పరిశీలన

విశాఖ స్పోర్ట్స్: విశాఖలో జరగనున్న ఐపీఎల్ మ్యాచ్‌ల నిర్వహణపై ఢిల్లీ క్యాపిటల్స్ ఆపరేషన్స్ జట్టు సభ్యులు ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథ్‌రెడ్డితో చర్చించారు. ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు తొలి రెండు మ్యాచ్‌లను హోమ్ గ్రౌండ్‌గా వైఎస్ఆర్ స్టేడియంలో ఆడనుంది. మార్చి 31న చెన్నై సూపర్ కింగ్స్‌తోను, ఏప్రిల్ 3న కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో తలపడనుంది. ఈ సందర్భంగా మ్యాచ్‌ల నిర్వాహణ, స్టేడియంలో అఫిషి యల్స్, ఆటగాళ్లకు కేటాయించే గదులు, కార్పొరేట్ బాక్సులు తదితర ఏర్పాట్లను పరిశీలించి ముందు జాగ్రత్తగా చేపట్టాల్సిన పనులను చర్చించారు. కార్యక్రమంలో ఏసీఏ సీఈవో ఎం.వి.శివారెడ్డి, సీఎఫ్ఓ నవీన్‌కుమార్, గేమ్ డెవలప్‌మెంట్ జీఎం ఎం.ఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కిరాణా వ్యాపారి ఇంట్లో చోరీ

- 4 తులాల బంగారు ఆభరణాలు అపహరణ



దొంగలు తెరిచిన బీరువా



బాధితుల నుంచి చోరీ వివరాలు తెలుసుకుంటున్న పట్టణ పోలీసులు

యలమంచిలి రూరల్: పట్టణంలో తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలు జరుగుతున్నాయి. స్థానిక ఎన్టీఆర్ కాలనీలో బుధవారం తెల్లవారుజామున ఓ కిరాణా వ్యాపారి ఇంటి తలుపులు విరగ్గొట్టి బీరువాలో భద్రపరిచిన నాలుగు తులాల బంగారు ఆభరణాలు, అర కిలో వెండి వస్తువులను దొంగలు అపహరించారు. పట్టణ ఎస్ఐ పాపినాయుడు తెలిపిన వివరాలు... ఎన్టీఆర్ కాలనీలోని మొదటి వీధిలో శ్రీగాకొల్లు రంగనాయకులు కుటుంబంతో నివాసం ఉంటూ తన ఇంటి వద్దే కిరాణా దుకాణం నడుపుతున్నారు. గత శుక్రవారం శ్రీకాకుళంలో ఉంటున్న తన మనుమరాలి రజస్వల ఫంక్షన్ కోసం ఇంటికి తాళం వేసుకుని వెళ్లారు. గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం తెల్లవారుజాము సమయంలో తాళం విరగ్గొట్టి ఇంట్లోకి ప్రవేశించి పడక గదిలో ఉన్న బీరువాను పగులగొట్టారు. సీక్రెట్ లాకర్‌లో దాచుకున్న బంగారు నక్లెస్,10 ఉంగరాలు, చెవి రింగులు, రెండు వెండి కంచాలు అపహరించుకుపోయారు. వ్యాపారి ఇంటి తలుపు తెరిచి ఉండడం బుధవారం ఉదయం చూసిన ఎదురింట్లో నివాసం ఉంటున్న వారు ఫోన్ ద్వారా సమాచారం అందజేశారు. రంగనాయకులు శ్రీకాకుళం నుంచి యలమంచిలి వచ్చి, చోరీపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీ జరిగిన ఇంటిని పట్టణ ఏఎస్ఐ నాయుడు,సిబ్బంది పరిశీలించారు. క్లూస్ టీం సభ్యులు ఆధారాలను సేకరించారు. పట్టణంలో వరుసగా జరుగుతున్న చోరీలను అదుపు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఘనంగా షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవం

అనకాపల్లి : స్థానిక వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ సమీపంలో శ్రీ షిరిడి సాయినాథ్ సేవా సమితి ఆధ్వర్యంలో సాయిబాబా ఆలయ 30వ వార్షికోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. సాయిబాబాకు తెల్లవారుజామున కాకడ హారతి మేలుకొలుపు, బాబా వారి మూలవిరాట్‌కు సహస్ర పుష్పార్చన, దత్త హోమం, మధ్యాహ్న హారతి వంటి కార్యక్రమాలు ఆలయ అర్చకులు బాబు చేపట్టారు. అనంతరం మధ్యాహ్నం భారీగా అన్న సమారాధన జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దర్జీ వృత్తికి మళ్లీ దర్జా



సీనియర్ టైలర్ పోతురాజును సత్కరిస్తున్న టైలర్లు

అనకాపల్లి : మారుతున్న కాలానికి అనుగుణంగా రెడీమేడ్ వస్త్రాలు రావడంతో టైలరింగ్ వృత్తికి ప్రాముఖ్యత తగ్గిపోతుందని న్యూ నవ్యాంధ్ర టైలర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.మహేష్ అన్నారు. ప్రపంచ టైలర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గవరపాలెం అగ్గి మరిచెట్టు వద్ద సీనియర్ టైలర్ కొమ్మనాపల్లి పోతురాజును అసోసియేషన్ సభ్యులు బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనేందుకు టైలర్లు సిద్ధంగా ఉండాలన్నారు. ఎన్నిరకాలైన రెడీమేడ్ వస్త్రాలు వచ్చినప్పటికీ టైలర్ చేతివృత్తి పనులకు గిరాకీ ఉందని ఆయన పేర్కొన్నారు. టైలర్ కుట్టిన వస్త్రాలకు మన్నిక ఉంటుందన్నారు. ప్రభుత్వం టైలర్లకు ప్రతి ఏడాది ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టైలర్లు ఎస్.కె.బాబ్జి, కె.కామేష్ పాల్గొన్నారు.

వినాయకుని ఆలయంలో విశేష పూజలు

రావికమతం: టి.అర్జాపురం బాల వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో స్వామికి బుధవారం పంచామృతాలు,పండ్లరసాలతో ప్రత్యేక అభిషేకం పూజలు,హోమం నిర్వహించారు. సంకటహర చతుర్థి సందర్భంగా పలువురు దంపతులతో అర్చకుడు లక్ష్మణరావు విశేష పూజలు, హోమం చేయించారు.

బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 5,934 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,710	4,570
మొదటి రకం	3,530	4,250
రెండో రకం	3,450	3,890
మూడోరకం	3,300	3,470

అనకాపల్లి సినిమాలు

ఈగల్	:	రాజా
సుందరంమాస్టర్	:	సత్యనారాయణస్క్రీన్-1
భ్రమయుగం	:	సత్యనారాయణస్క్రీన్-2
సిద్ధార్థరోయ్	:	షిర్డిసాయి
ఊరు పేరు భైరవకోన	:	పర్తిసాయి
నాగదీపం	:	వెంకటేశ్వర
------	:	శ్రీసత్య
హనుమాన్	:	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 52 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-14 యూనిట్లు, బీ పాజిటివ్-26 యూనిట్లు, ఓ పాజిటివ్-10 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 459 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 401 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

సీవీ రామన్‌కు ఘన నివాళులు



కశింకోట డీపీఎన్ హైస్కూలులో సీవీ రామన్ చిత్ర పటం వద్ద ఉపాధ్యాయుల నివాళులు



గ్లోబ్ గురించి చిన్నారులకు వివరిస్తున్న గిరీష్‌కుమార్

కశింకోట: కశింకోటలోని డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో జాతీయ సైన్స్ కాంగ్రెస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం ఎం.ఆర్.వి అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తాళ్లపాలెంలోని గాయత్రి స్కూల్లో జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ నమూనాలను ప్రదర్శించారు. శాఖా గ్రంథాలయ అధికారి కె. జగన్నాథం మాట్లాడుతూ నోబుల్ బహుమతి పొందిన సీవీ రామన్‌తోపాటు అనేక మంది శాస్త్రవేత్తలు, విజ్ఞాన దాయక పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయని, వాటిని చదివి విజ్ఞానవంతులు కావాలని విద్యార్థులను కోరారు. ప్రతి ఆదివారం విద్యార్థుల కోసం గ్రంథాలయంలో ప్రత్యేకంగా చదవడం మాకిష్టం ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, దీన్ని వినియోగించుకోవాలన్నారు. హెచ్‌ఎం వై. నగేష్, కరస్పాండెంట్ బి.రామ్‌కుమార్, స్కూలు నిర్వాహకులు అప్పారావు, బి. నరసింహమూర్తి, ఉపాధ్యాయులు ఎం. ధనుంజయరావు, పి. కలయిసెల్వి తదితరులు పాల్గొన్నారు.



తాళ్లపాలెం గాయత్రి స్కూల్లో విద్యార్థుల సైన్స్ నమూనాల ప్రదర్శన

ప్లే స్కూల్లో సైన్స్ దినోత్సవం

అనకాపల్లి : స్థానిక వుడ్‌పేట హ్యాపీ కిడ్స్ ప్లే స్కూల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ శెట్టి గిరీష్ కుమార్ ఖగోళ, జీవ, రసాయనిక సైన్స్ ప్రయోగాలను చేసి చూపించి చిన్నారుల అబ్బురపరిచారు. చిన్నారులంతా కేరింతలతో సైన్స్ ప్రయోగాలను ఎంతో శ్రద్ధగా తిలకించారు. భారత శాస్త్రవేత్తలలో ఒకరైన సి.వి.రామన్ నోబెల్ బహుమతి పొందిన రోజు 28 ఫిబ్రవరి అని, ఆ మహనీయుని ఘనతకు పరంపరగా మనం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకొంటున్నామని అన్నారు. అంతకుముందు విద్యార్థులు తయారు చేసిన సైన్స్ నమూనాలను ప్రదర్శించి, సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ సునీత, చిన్నారులు పాల్గొన్నారు.

357మంది రోగులకు ఉచిత వైద్యపరీక్షలు



రోగితో మాట్లాడుతున్న వైద్యుడు నాగేంద్ర



రోగికి మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

అనకాపల్లి : స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో సచివాలయం-14 (పెదరెల్లివీధి)రోగులకు బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 ఉచిత వైద్య శిబిరం జరిగింది. సచివాలయం పరిధిలో రోగులకు వారివారి సమస్యలను వైద్యులకు తెలియజేశారు. శిబిరంలో వైద్యుడు నాగేంద్ర మాట్లాడుతూ గతంలో రోగికి వైద్యం కావాలంటే ఆస్పత్రుల చుట్టూ తిరిగేవారని, నేటి ప్రభుత్వంలో వైద్యులు రోగుల వద్దకు వచ్చి ఉచితంగా వైద్యం అందిస్తున్నట్టు తెలిపారు. వైద్యశిబిరంలో 357మంది రోగులను ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు, కంటి వైద్యుడు, గైనిక్ నిపుణులు రోగులను పరిక్షించారు. కీళ్ల వ్యాధితో బాధపడుతున్న ఒక వ్యక్తిని స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి రిఫర్ చేసినట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్స్, అంగన్‌వాడీ ఉద్యోగులు పాల్గొన్నారు.



పౌష్టికాహారం ప్రదర్శనలో అంగన్‌వాడీ ఉద్యోగులు

విశాఖ జీవీఎంసీ కార్యాలయం వద్ద 3న మహాగర్జన

అనకాపల్లి : సమాన పనికి సమాన వేతనం, రెగ్యులరైజేషన్, ఎం.టి.ఎస్ అమలు, డైరెక్ట్ పేమెంట్ తదితర సమస్యలపై విశాఖ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మార్చి 3 ఉదయం 10 గంటల నుంచి జరిగే మహాగర్జనలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, పార్ట్ టైమ్, గెస్ట్, పీస్ రేట్ ఉద్యోగులందరూ పెద్ద ఎత్తున వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ - జేఏసీ జిల్లా కన్వీనర్ వి.వి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో బుధవారం మహాగర్జన గోడపత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలైన సమాన పనికి సమాన వేతనం, రెగ్యులరైజేషన్లను వెంటనే అమలు చేయమని ఆయన కోరారు. వివిధ ప్రభుత్వ సంస్థల్లో 3 దశాబ్దాల నుంచి ఎన్ఎంఆర్, డైలీవేజ్ కంటింజెంట్, టైంస్కేల్ ఉద్యోగులుగా పని చేస్తున్నారని తక్షణమే ప్రతి ఉద్యోగిని రెగ్యులర్ చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆర్ శంకరరావు, సిహెచ్. శివాజీ పాల్గొన్నారు.

3న పల్స్‌పోలియో విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతిరావు

కశింకోట : పోలియో నిర్మూలనకు వచ్చే నెల 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కశింకోట పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.తిరుపతిరావు కోరారు. స్థానిక పీహెచ్‌సీలో బుధవారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహణపై ఆరోగ్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పీహెచ్‌సీ పరిధిలో ఐదేళ్లలోపు పిల్లలు 3916 మంది ఉన్నారన్నారు. వీరికి పోలియో చుక్కలు వేయడానికి 41 బృందాలను నియమించామన్నారు. నిర్దేశిత 3వ తేదిన పోలియో చుక్కలు వేసుకోకపోతే వచ్చే నెల 4,5 తేదీల్లో ఇంటింటికి వెళ్లి సిబ్బంది పోలియో చుక్కలు వేయాల్సి ఉంటుందన్నారు. హైరిస్కు ప్రాంతమైన ఇటుకల బట్టీల్లో కూడా సంచార బృందాల ద్వారా పోలియో చుక్కలు వేయాల్సి ఉంటుందన్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు.

విశాఖ రైల్వే జోన్‌పై మోసగిస్తున్న కేంద్రం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు లోకనాథం

అనకాపల్లి : విశాఖ రైల్వేజోన్ భూముల కేటాయింపుపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన సమాచారం ఇవ్వడం లేదని, విశాఖ జిల్లా ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.లోకనాథం బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి రైల్వేజోన్‌కు అవసరమైన అన్ని చర్యలు కేంద్ర ప్రభుత్వం తీసుకొని నిధులు విడుదల చేసినట్టు చెప్పడం ప్రజలను మోసగించడమే అన్నారు. ఐదేళ్ల వరకు రైల్వే జోన్ ఊసెత్తని బీజేపీ ఎన్నికల ముందు రైల్వేజోన్ ఏర్పాటు చేయడానికి కేంద్రం సిద్ధంగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వం భూములిచ్చి సహకరించడం లేదని చెప్పడం రాజకీయ లబ్ధి కోసమే అన్నారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీల్లో ఒక్కదానిని కూడా మోదీ ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు.

రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి బీమా సాయం

కశింకోట : తాళ్లపాలెంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కర్రి నూకరత్నం కుటుంబానికి వైఎస్సార్ ప్రమాద బీమా కింద రూ.5 లక్షలు మంజూరైంది. మంగళవారం రాత్రి బైక్ ఢీకొనడంతో ఆమె మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వైఎస్సార్ ప్రమాద బీమాలో భాగంగా రూ.10 వేలు దహన సంస్కారాల కోసం తక్షణ సహాయంగా బుధవారం వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్ చేతుల మీదుగా భర్త నూకినాయుడుకు అందజేశారు. మిగిలిన రూ.4.90 లక్షల సహాయం నేరుగా అతని బ్యాంకు అకౌంట్‌కు జమ కానుందని గణేష్ తెలిపారు. పాల సంఘం అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు, హైస్కూలు విద్యా కమిటీ మాజీ చైర్మన్ గుమ్మడి శ్రీను, వైఎస్సార్ సీపీ స్థానిక నాయకుడు పెంటకోట రమణ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



నూకరత్నం కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందజేస్తున్న లగిశెట్టి గణేష్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి : స్థానిక రింగ్‌రోడ్డు లక్ష్మీనారాయణనగర్ విద్యుత్‌శాఖ ఫీడర్ పరిధిలో విద్యుత్ వైర్లు మరామత్తుల నిమిత్తం గురువారం ఉదయం 10 నుంచి 2గంటల వరకూ విద్యుత్‌ను నిలుపుదల చేయడం జరుగుతుందని ఆశాఖ ఈఈ కె.రాజశేఖర్, ఏఈ శ్రీనివాసరావులు బుధవారం ఓ ప్రకటనలో అన్నారు. కోట్నివీధి, గాంధీబొమ్మ జంక్షన్, చిన్నవీధి, పప్పులవీధి, కర్ణలవీధి, తాకాశివీధి, పెరుగుబజార్ జంక్షన్ వరకూ విద్యుత్‌ను నిలుపుదల చేయడం జరుగుతుందని, ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్‌శాఖ ఉద్యోగులకు సహకరించాలని ఆయన కోరారు.

మూడు కంపెనీల్లో 30 మందికి ఉద్యోగాలు



నిరుద్యోగికి ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న దృశ్యం

అనకాపల్లి : రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో బుధవారం నిరుద్యోగ యువతీ యువకులకు మూడు ప్రైవేట్ కంపెనీల్లో మినీ జాబ్ మేళా కార్యక్రమం జరిగింది. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి నిరుద్యోగ యువతీ యువకులు జాబ్ మేళాలో పాల్గొన్నారు. ముత్తూట్ ఫైనాన్స్, ర్యాండ్ స్టాండ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, సుస్వదీప్ ఆగ్రో సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు జాబ్ మేళా నిర్వహించి 80 మందికి ఇంటర్వ్యూలు చేయగా 30 మంది ఎంపికైనట్టు జిల్లా వృత్తి నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్లేస్‌మెంట్ మేనేజర్ పి.శ్రీనివారావు చెప్పారు. పై కంపెనీల్లో సెల్స్‌మేన్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, స్టోర్ గోడౌన్ ఇన్‌చార్జిలుగా పనిచేయడానికి పోస్టులను బట్టి రూ.10 వేలు నుంచి రూ.18వేలు వరకు నెలకు జీతాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. కొత్తగా ఎంపికైన నిరుద్యోగులు వారం రోజుల్లో ఉద్యోగాల్లో చేరుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు మోదకొండమ్మ ఆలయ శంకుస్థాపన

మునగపాక : మండల కేంద్రంలో గురువారం మోదకొండమ్మ ఆలయ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఉదయం 10 గంటల తరువాత ప్రత్యేక పూజా కార్యక్రమాలతో శంకుస్థాపన జరుగుతుందన్నారు. మునగపాక బైపాస్ రోడ్డును ఆనుకొని నూతనంగా నిర్మిస్తున్న ఆలయ శంకుస్థాపనకు భక్తులంతా తరలిరావాలని కోరారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9966329167, 9912440601
సాక్షి

పొగాకు రహితంగా తయారు చేద్దాం..

కోటవురట్ల: పొగాకు రహిత గ్రామంగా తయారు చేద్దామంటూ విద్యార్థులు నినదించారు. గొల్లపేట ఎంపీపీ స్కూల్ విద్యార్థులు టొబాకో ఫ్రీ జోన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పాఠశాల నుంచి ర్యాలీ నిర్వహించి గ్రామస్తులకు చైతన్యం కలిగించారు. పొగాకు వల్ల కలిగే అనర్ధాను వివరించి, పొగాకు జోలికి పోమంటూ ప్రతిజ్ఞ చేశారు.



కోటవురట్ల గొల్లపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం

నక్కపల్లి : మండల కేంద్రం నక్కపల్లి చేనేత కాలనీలో వినాయక ఆలయ ప్రారంభోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయంలో గణపతి హోమం విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో గణపతి విగ్రహ ప్రతిష్ఠ, గోపురంపై కలశ స్థాపన, ఆలయం ఎదురుగా ధ్వజస్తంభం ఏర్పాటు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. హోమం, శాంతికల్యాణం, పూర్ణాహుతి అనంతరం ఆలయం వద్ద అన్న సమారాధన జరిపారు. ఉపమాక దేవస్థానం అర్చకులు వరప్రసాద్, శేషాచార్యులు స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

కొత్త అమావాస్య జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర ఏప్రిల్ మాసంలో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ అన్నారు. స్థానిక నూకాంబిక అమ్మవారి బాలాలయంలో అమ్మవారి ఉత్సవ విగ్రహం, కలశప్రతిష్ఠ, అమ్మవారి మాలాధారణ వంటి కార్యక్రమాలు బుధవారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది అమ్మవారి అమావాస్య జాతరను బాలాలయంలో నిర్వహించడం జరుగుతుందని, అమ్మవారి ఆలయ పునఃనిర్మాణ పనులు జరుగుతున్నాయని, ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. అమ్మవారి ఆలయంలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, విరాళాలు ఇచ్చే భక్తులు ఆలయ ఈవోకు అందజేసి, తగిన రసీదు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బండారు ప్రసాదు, మాలాధారణ గురుస్వామి పాలిమేర శ్రీను, ఆలయ ధర్మకర్తలు బుద్ధ నర్సింగరావు, పీలా లక్ష్మీశ్రీనివాసరావు, ఆడారి ఉమాశ్రీనివాసరావు, కొండూరు రవీంద్రనాథ్, గొల్లవిల్లి నర్సింగరావు, పాము అనురాధ, కె.శోభారాణి పాల్గొన్నారు.



అమ్మవారి మాల ధరిస్తున్న పాలిమేర శ్రీను

నూకాంబిక క్యూ కాంప్లెక్స్ నిర్మాణానికి నిధులు

అనకాపల్లి : గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయ ఆవరణలో శిథిలావవస్థలో ఉన్న భక్తుల క్యూ కాంప్లెక్స్ మండపం నూతన నిర్మాణానికి ప్రభుత్వం రూ.కోటి 60 లక్షలు నిధులు మంజూరు చేసినట్టు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రభుత్వం విడుదల చేసిన నిధుల కాగితాన్ని ఆలయ ఈవో బండారు ప్రసాద్, చైర్మన్ కొణతాల మురళీకృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీజీఎఫ్ నిధుల నుంచి రూ.కోటి, మాచింగ్ గ్రాంట్ నుంచి రూ.60లక్షలు విడుదల చేసినట్లు తెలిపారు. క్యూ కాంప్లెక్స్ నిర్మాణానికి త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీచేశారు. అమ్మవారి గర్భగుడి ఆలయ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.



నిధుల కాపీని మంత్రికి అందజేస్తున్న ఈవో బండారు ప్రసాద్, చైర్మన్ కొణతాల మురళీకృష్ణ

వలంటీర్ల సేవలు ఆదర్శనీయం

అనకాపల్లి : రానున్న సార్వతిక ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుని మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అందుకోవాలని ఎంపీ బి.వి.సత్యవతి అన్నారు. స్థానిక వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో వలంటీర్లతో బుధవారం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధులుగా వలంటీర్లు చేసిన సేవలు మరువలేనివన్నారు. అవ్వాతాతలకు మన అందరి ప్రభుత్వం చేసిన సేవలు గురించి విస్తృతంగా ప్రజలకు తెలియజేయాలని ఆమె కోరారు. కరోనా విపత్తుల సమయంలో వలంటీర్ వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలిచిందని, కరోనా కట్టడి చేయడంలో రాష్ట్రంలో మరణాల సంఖ్యను తగ్గించగలిగినట్టు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు పాల్గొన్నారు.



వలంటీర్లతో మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ



కన్నూరుపాలెం హైస్కూల్లో విద్యార్థులకు రక్తహీనతపై అవగాహన కలిగిస్తున్న పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసాద్

కశింకోట : విద్యార్థులు రక్తహీనత బారిన పడకుండా ఉండేందుకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని తాళ్లపాలెం పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ ఎం.ఎస్.వి ప్రసాద్ కోరారు. కన్నూరుపాలెం హైస్కూలు జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని బుధవారం విద్యార్థులకు రక్తహీనతపై అవగాహన కలిగించారు. రక్త హీనత రాకుండా చౌకగా లభ్యమయ్యే తోటకూర, చింతచిగురు, మెంతు కూర, మునగ, గోంగూర తదితర ఆకుకూరలు, బెల్లంతో తయారు చేసిన వేరు శెనగ ఉండలు, చెక్కిలు, నువ్వుండలు, ఉసిరికాయ, జామ, బొప్పాయి వంటి పండ్లు ఆహారంలో భాగంగా సేవించాలన్నారు. హెచ్‌ఎం ఎస్.ఎస్.రామప్రసాద్, సైన్స్ ఉపాధ్యాయురాలు శేషారత్నం, ఎంపీహెచ్‌ఈవోలు కె.ఎస్.ఆర్.కె.జి నరసింహారావు, ఆర్.వి.లక్ష్మి, సీహెచ్‌వో ధనలక్ష్మి, ఏఎన్ఎం సింహాచలం, ఆరోగ్య కార్యకర్త ఆర్.వి.వి సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతులకు సున్నా వడ్డీ జమ

కశింకోట : మండలంలోని ఖరీఫ్, రబీ పంట రుణాలు తీసుకున్న 1435 మంది రైతులకు వైఎస్సార్ సున్నా వడ్డీ కింద రూ. 26,70,975 జమ అయినట్టు మండల వ్యవసాయ అధికారి ఎం. స్వప్న బుధవారం తెలిపారు. దీనిలో 2022 ఖరీఫ్‌లో 341 మంది రైతులకు రూ.7,40,201, 2021-22 రబీలో 1094 మంది రైతులకు రూ.19,30,774 వంతున సున్నా వడ్డీ జమ చేశారన్నారు. మూడో విడతగా వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ కింద రూ.2 వేలు వంతున బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేశారన్నారు.

గ్రామ పంచాయితీ కార్యాలయం, జట్టపురెడ్డి తుని,అనకాపల్లి జిల్లా

రేఖా సంఖ్య : 4/2024, తే 28.02.2024 ది.

బహిరంగ వేలములు మరియు టెండర్లు నోటీసు

అనకాపల్లి జిల్లా, కశింకోట మండలం, జట్టపురెడ్డి తుని గ్రామ పంచాయితీకి చెందిన 2024-2025 సం॥ బహిరంగ వేలములు నిర్వహణ మరియు టెండర్లు స్వీకరణ ఈ దిగువ I, II షెడ్యూల్స్ నందు వివరించబడిన వివరములు ప్రకారము జరుపబడును. షెడ్యూల్ I నందలి వివరములు గల బహిరంగ వేలములు తే02.03.2024 ది శనివారం మధ్యాహ్నం 02-00 గంటల నుండి ఈ దిగువ సంతకము దారునిచే, కశింకోట మండలము ఇ.వో (పి.ఆర్ - ఆర్.డి) వారి సమక్షమున నిర్వహించబడును. వేలము పాటలో పాల్గొనువారు షెడ్యూల్ I నందు చూపబడిన ధరావత్తులు చెల్లించి, సాల్వెన్సీ ధృవపత్రము దఖలు పర్చవలెను. షెడ్యూల్ II నందు వివరములు ప్రకారము సప్లయిలు చేయుటకు టెండర్లు తే 02.03.2024 ది శనివారం మధ్యాహ్నం 2.00 గంటల నుండి 4.00 గంటల వరకు స్వీకరించబడి అదే రోజు మధ్యాహ్నం 5.00 గంటలకు హాజరయిన టెండరుదారుల సమక్షమున తెరువబడును.

షెడ్యూల్ -I

వ.నెం	పాట వివరములు 2024-2025 సం॥ మునకు	ధరావత్తులు రూ.లలో	రిమార్కులు
1	వారపు సంతలో ఆశీలు వసూలు చేసుకొను హక్కు	5,000/-	తే 01-01-2024ది తరువాత శ్రీ తహసీల్దార్ వారిచే రూ. 3,00,000/- సాల్వెన్సీ
2	కొబ్బరి చెట్ల ఫలసాయం పొందు హక్కు	1000/-	

వరుస నెంబరు: 1 వేలము పాటలో పాల్గొనుటకు సాల్వెన్సీ ధృవపత్రము శ్రీ తహశీల్దారు వారిచే తే.01.01.2024 ది తదుపరి జారీ చేయబడినదై ఉండవెను.

షెడ్యూల్ -II

వ.నెం	సప్లయిలు వివరములు 2024 -2025	ధరావత్తులురూ.లలో
1	గ్రామ పంచాయితీ పరిధిలో పారిశుద్ధ్యము పనులకు గాను 4 మంది పని వారల సప్లయికొరకు	200/-
2	మంచినీటి సరఫరా పనులకు ఒక్క పనివారు సప్లయి చేయుటకు	200/-
3	గ్రామ పంచాయితీ పారిశుద్ధ్య అవసరాలకు సున్నం, బ్లీచింగ్ ఫినాయిల్ సప్లయి చేయుటకు	500/-
4	గ్రామ పంచాయితీ మంచి నీటి సరఫరా పైపులు విడి భాగములు సప్లయి చేయుటకు	500/-
5	గ్రామ పంచాయితీ ట్రాక్టర్ నిర్వహణ డ్రైవర్ సప్లయి చేయుటకు	200/-
6	గ్రామ పంచాయితీ వీధి లైట్లు మరమత్తులు నిమిత్తం లైటు ఒక్కంటికి రేటు ప్రకారం ఎలక్ట్రీషియన్ సప్లయి కొరకు	200/-

షెడ్యూల్ - I నందలి బహిరంగ వేలములు, షెడ్యూల్ - II నందలి టెండర్లు సంబంధిత మిగిలిన షరతులు, ఇతర వివరములు కార్యాలయము పని వేళల యందు తెలుసుకొనవలెను. బహిరంగ వేలములు, టెండర్లు స్వీకరణ వాయిదా వేయు అధికారము ఈ దిగువ సంతకము దారునికి కలదు. బహిరంగ వేలములు, టెండర్లు గ్రామ పంచాయితీ వారి అనుమతి పొందిన తదుపరి ఖాయపర్చబడును. పాట మొత్తంకు 5% స్టాంప్ డ్యూటీ చెల్లించవలెను. హెచ్చు పాట గ్రామ పంచాయతీ వారిచే ఖరారు పరిచిన యెడల పాట మొత్తం చెల్లించి పొందవలెను.

నిబంధనలు:- 1. పాటలో పాల్గొనేవారు పంచాయితీకి బకాయిలు ఉండరాదు, 2. పాట గ్రామ పంచాయతీ ఆమోదమునకు లోబడి ఉండును. 3. పాట ఖాయం అయినా తదుపరి ప్రభుత్వ నిబంధనల ప్రకారం నూటికి 5శాతం స్టాంపు డ్యూటీ చెల్లించి గ్రామ పంచాయతీకి అగ్రిమెంటు వ్రాయవలెను. 4. ప్రకృతి వైపరీత్యాలు వలన వచ్చు నష్టమునకు గ్రామ పంచాయతీకి సంబంధం లేదు. పూర్తి బాధ్యత గుత్తేదారు వహించవలెను. 5. వేలంపాటలో పాటదారుల తరుపున వేరొకరిని అనుమతించబడదు.

సం/- శ్రీమతి అల్లు మేరీ జోస్న,
పంచాయితీ కార్యదర్శి
గ్రామ పంచాయితీ, జట్టపురెడ్డి తుని.